## క్లుప్తంగా

### ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితాల ప్రదర్శన

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక తనిఖీల నిమిత్తం పంట నమోదు జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఎచ్చెర్ల వ్యవసాయాధికారి వై.సురేష్ గురువారం చెప్పారు. ఈ నెల 18లోపు రైతులు పరిశీలించి, తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. మార్పులు ఉంటే ఆర్‌బీకే సహాయకుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు.

### రంగనాథునికి ప్రత్యేక పూజలు


మహాకుంభాభిషేకం చేస్తున్న పండితులు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలోని పద్మాధాత్రి సమేత రంగనాథస్వామి దేవాలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలు అంబరాన్నితాకాయి. గురువారం ఉదయం 8 గంటల సమయంలో 1028 కలశాలతో ఏకోత్తర సహస్రకలశ స్నపన (మహా కుంభాభిషేకం) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం ఆరు వేలమందికి అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ రామారావుకు అభినందనలు


రామారావుతో వైఎస్సార్‌సీపీ నాయకులు

గార/శ్రీకాకుళం రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన నర్తు రామారావుకు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయానికి విచ్చేసి న రామారావును డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గంగు రామారా వు తదితరులు అభినందించారు.

### 'నాగార్జున వర్సిటీ వీసీ తీరు సరికాదు'

శ్రీకాకుళం న్యూకాలనీ: గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తీరు ఎంత మాత్రం సరికాదని ఆంధ్రా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తురకా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీలో ఈ నెల 15న అకడమిక్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి రామ్‌గోపాల్‌వర్మ లాంటి వ్యక్తులను పిలవడం సరికాదన్నారు.

### రోడ్డు మరమ్మతులు పూర్తి


పూర్తయిన రోడ్డు నిర్మాణం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని పాత 16వ నంబరు జాతీయ రహదారి నుంచి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ ఎస్ఎంపురం క్యాంపస్) వరకు రోడ్డు మరమ్మతులు పూర్తిచేశారు. 650 మీటర్ల రహదారికి రూ.ఏడు లక్షల జెడ్పీ నిధులతో మరమ్మతులు చేపట్టారు.

### ప్రజాదరణ ఓర్వలేకే విమర్శలు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. గురువారం జి.సిగడాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసిన వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, జేసీఎ మండల కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, సర్పంచ్‌లు చిత్తిరి మోహన్, చందక సతీష్, ముద్దాడ గౌరీ, బాణాన సూర్యనారాయణ, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు, నాయకులు టంకాల సత్యనారాయణ, తోంగ్రోడు సురేష్, కుమరాపు నాగభూషణనాయుడు పాల్గొన్నారు.

### సీపీఎస్ రద్దు చేయాలి

జి.సిగడాం: పాదయాత్ర హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ మండల శాఖ అధ్యక్షుడు మొయ్యి జనార్దనరావు కోరారు. గురువారం జి.సిగడాంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ కారణంగా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత ఉండదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కాయల రమేష్, ప్రధాన కార్యదర్శి కిల్లారి వెంకటరమణ పాల్గొన్నారు.


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు


శ్రీకాకుళం రూరల్: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నైరా వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు


గార: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు

# పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం


ఎచ్చెర్ల: ధర్మవరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనలో భాగంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం అవతరించడానికి మూలకారకుడైన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని అమరజీవి పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా నగరంలోని గాంధీపార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి మండవిల్లి ఎస్ఎస్ గుప్తా మాట్లాడుతూ 58 రోజుల అకుంఠిత ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి తెలుగువారికి ఆంధ్ర రాష్ట్రం పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టారని గుర్తు చేశారు. అసెంబ్లీలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు తమ్మిన భాస్కర్, మండవల్లి మల్లికార్జునరావు, పేర్ల కామరాజు, పట్నాల ఆనంద్, వి.ఎస్.ఎల్.నరసింహం, కార్యదర్శి కాపుగంటి సంతోష్, కోశాధికారి పూసర్ల నగేష్, తమ్మిన వరాహ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్:** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని యువ పారిశ్రామికవేత్త అంధవరపు ప్రసాద్ అన్నారు. శాంతినగర్ కాలనీలో గల గాంధీ మందిరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విగ్రహదాతలు మండవిల్లి మల్లిఖార్జునరావు, మండవిల్లి ఎస్.ఎస్.గుప్త, మందిర కన్వీనర్ జామి భీమశంకర్, కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకరరావు, బాడాన దేవభూషణరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన మురళీధర్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వి.ఎస్.ఎల్.నరసింహం, పూసర్ల నగేష్, కాపుగంటి సంతోష్, తమ్మిన వరహా నరసింహమూర్తి పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్: పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**రణస్థలం:** శ్రీరాములు త్యాగం మరువలేనిదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శ్రీరాములు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీఓ వండాన ధనుంజయరావు, ఎంఈఓ అల్లాడ త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గార:** త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని కె.మత్స్యలేశం సర్పంచ్ బి.లలిత అన్నారు. బుద్ధా పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కరస్పాండెంట్ బి.ఎర్రన్న, ప్రిన్సిపాల్ తరుణి అర్జున చక్రవర్తి, బత్తుల గోవిందరావు, డీఏ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల:** ధర్మవరం శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన బి.బంగారులక్ష్మీ, సీహెచ్ రోజా, డి.నీలిమలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు, సహాయాధికారి బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు


శ్రీకాకుళం అర్బన్: బలగ గ్రంథాలయంలో శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం అర్బన్:** బలగ శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉగ్రసేన, సహాయకులు కె.అనిత, మున్సిపల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


లావేరు: లింగాలవలసలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అప్పలనాయుడు

**లావేరు:** లింగాలవలలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం, మురపాక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, వార్డు మెంబరు ఇప్పిలి కృష్ణ, నాయకులు గొర్లె సూర్యనారాయణ, తరిగొప్పుల శ్రీనివాసరావు, జగ్గురోతు రాము, పతివాడ గురునాయుడు, శనపతి గౌరునాయుడు, గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

## రణస్థలంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు


విజయోత్సవంలో పార్టీ నాయకులు

రణస్థలం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నర్తు రామారావు ఘన విజయం సాధించడంతో రణస్థలంలో పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకట్ రెడ్డి, మహంతి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మింది శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న ఏహెచ్‌టీయు ఎస్ఐ వెంకటరావు

శ్రీకాకుళం క్రైమ్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, భవిష్యత్తులో అనారోగ్యపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఏహెచ్‌టీయూ ఎస్ఐ లండ వెంకటరావు అన్నారు. పట్టణంలోని భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎల్‌పీ ప్రోగ్రాం మేనేజర్ పెంకి బాలకృష్ణ, ఏఎస్ఐ రమణమూర్తి, చైల్డ్‌లైన్ ప్రతినిధి శంకర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ప్రాజెక్టు డే


బాలుడి ప్రతిభను పరిశీలిస్తున్న సూరిబాబు, మల్లేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి రోడ్‌లోని శర్వాణి విద్యాలయ పాఠశాలలో గురువారం ప్రాజెక్ట్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రాజెక్ట్ డేను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ శాస్త్రాలకు, భాషలకు చెందిన ప్రాజెక్టులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని మల్లేశ్వరరావు పేర్కొన్నారు. శర్వాణి విద్యాలయ సంస్థల అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు


పొన్నాడ కేజీబీవీలో ఏర్పాటు చేసిన యువ పర్యాటక క్లబ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పొన్నాడ కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఏడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులను భాగస్వాములను చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ పర్యాటక అధికారి డి.రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక, విజ్ఞాన కేంద్రాలు, బీచ్‌లు, ప్రధాన జాతరలను అనుసంధానం చేస్తూ ప్రచారం కల్పించేందుకు క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పొన్నాడ కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సూర్యకుమారి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి.అమ్మాజీ, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పగటి చీకటి శ్రీకాకుళం వాసులను ఆశ్చర్యపరిచింది. నగరంలో మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. నల్లటి మేఘాలు కమ్ముకోవడంతో చుట్టూ చీకటి ఆవరించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్క్వాడ్

జి.సిగడాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సెకెండియర్ పరీక్షల ను స్క్వాడ్ బృందం గురువారం పరిశీలించింది. 216 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు.

## అగ్ని ప్రమాదాలు నియంత్రించేందుకు శిక్షణ



మెటీరియల్‌ను అందజేస్తున్న డీఎఫ్ఓ వీరభద్రరావు

శ్రీకాకుళం క్రైమ్ : వేసవి సమీపిస్తున్నందున అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త పడాలని జిల్లా అగ్నిమాపకాధికారి బి.వీరభద్రరావు సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రాథమిక దశలోనే నిరోధించేలా ప్రజలకు వ్యాపార, పారిశ్రామిక వర్గాల వారికి చైతన్యపర్చి వారికి శిక్షణ అందించే కార్యక్రమం బేసిక్ ఫైర్ ప్రివెన్షన్ అండ్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ కోర్సు జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. విశాఖపట్నం ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎఫ్ఓ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఏడీఎఫ్ఓలు వరప్రసాదరావు, అశోక్‌లు జిల్లాకు సంబంధించిన 25 మంది సభ్యులకు (పరిశ్రమ, థియేటర్, స్కూల్, కళాశాల, షాపింగ్‌మాల్, కాంప్లెక్సు వర్గాల వారు) మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ మూడురోజులు శిక్షణ పూర్తయ్యాక ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి రాష్ట్ర డీజీ జారీ చేసిన సర్టిఫికెట్‌ను స్మార్ట్ ఫోన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మూడు రోజులకు రూ. 3 వేలు ఫీజును విజయనగరం రీజనల్ ట్రైనింగ్ సెంటర్ పేరిట డీడీ తీసి చలానా కట్టాలన్నారు. శిక్షణ తరగతులకు వచ్చిన వారికి ఫైర్‌కు సంబంధించిన సబ్జెక్ట్ మెటీరియల్‌ను డీఎఫ్ఓ అందజేశారు.

## దంత సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

లావేరు: దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని లావేరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ మణిభూషణ్ అన్నారు. నేషనల్ ఓరల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం లావేరు పీహెచ్‌సీ వద్ద ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. దంత సమస్యలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి


నారాయణ సేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న స్వామినాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. సత్యసాయి నారాయణ సేవా సంఘానికి గురజాడ విద్యాసంస్థల సౌజన్యంతో రూ.7.50 లక్షలతో కొనుగోలు చేసిన మినీ వాహనాన్ని మునసబుపేటలోని విద్యాసంస్థల ఆవరణలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిట్టిపూడివలసలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలకు ఈ వాహనాన్ని వినియోగించనున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాలకు, వృద్ధులకు, అనాథలకు ఈ వాహనం ద్వారానే భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. చిట్టిపూడివలసలో రూ.4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రంగారావు, సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు, రిమ్స్ అన్నదాన పథక జిల్లా అధ్యక్షుడు రమణబాబు, సేవాదళ్ కోఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

రణస్థలం: ఉపాధి పనులు ప్రణాళికాబద్ధంగా చేయాలని, వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఉపాధి ఏపీడీ కె.లోకేష్ అన్నారు. రణస్థలంలోని ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయాన్నే పనికివచ్చేలా వేతనదారులకు అవగాహన కల్పించాలరు. రోజు వేతనం రూ.250 వచ్చేలా పనిచేయించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ వండాన ధనుంజయరావు, ఏపీఓ ఎం.శ్రీనివాసనాయుడు, జేఈలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సైన్స్ ఎగ్జిబిషన్లతో సృజనాత్మకత


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రణస్థలం: విద్యార్థి దశలోనే సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. అర్జునవలస హైస్కూల్లో విర్చో ఫౌండేషన్ సౌజన్యంతో అమెరికన్ ఇండో ఫౌండేషన్ వార్షిక కార్యక్రమం సందర్భంగా సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆరు సైన్సు ప్రాజెక్టులకు ఎంపిక చేసి విద్యార్థులు బండారు హర్షవర్ధన్, కె.రమ్య, కె.వాణీ, టి.లక్ష్మణ, టి.జయసూర్య, కె.సురేష్‌లకు సీఈవో ప్రవీణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, విర్చో సీనియర్ టెక్నికల్ నగేష్, హెచ్ఆర్ మేనేజర్ కృష్ణమోహన్, ప్రాగామ్ కోర్డినేటర్స్ విశ్వ, హారిక, సర్పంచ్ మీసాల లక్ష్మీరామునాయుడు, ఉప సర్పంచ్ రామిశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు

శ్రీకాకుళం అర్బన్: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జిల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గురువారం 1000 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యసాయి-జాడ సాయి, శివ, సుదర్శన్, ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, సిక్కోలు యువశక్తి ఫౌండేషన్ ప్రతినిధి యార్లగడ్డ గీత శ్రీకాంత్, శ్రీకాకుళం న్యూబ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్, డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రభాస్ సూర్య, అప్ హోల్డ్ ప్రతినిధి సుప్రజ, జేసీఐ గ్రీన్ సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, సిక్కోలు చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటలక్ష్మి, డేవిడ్, రోటరీ క్లబ్ జైశ్రీరామ్, కెరియర్ ఫైర్ ఫౌండేషన్ ప్రతినిధి సాయిబాబా పాల్గొన్నారు.

## సహకార సంఘాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్ : సంపూర్ణ అవగాహనతో విధులు నిర్వహించి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు లేబర్స్ కాంట్రాక్ట్ సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు సూచించారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం సహకార సంఘాల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు వివరించారు. పాలకవర్గాల అధికారాలు, విధులు తెలియజేస్తూ సంఘాల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డీసీసీబీ పాలకమండలి సభ్యుడు బొడ్డేపల్లి నారాయణరావు, డివిజినల్ సహకార అధికారి కె.దామోదర్, సబ్ డివిజినల్ సహకార అధికారి ఎస్.భూషణరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకిరాం, ఎం.శ్రీనివాసరావు, ఎఫ్.పద్మ, ఎం.జయ, జి.అరుణకుమారి, జి.వి.రమణమూర్తి, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.